కరీంనగర్ సూర్య

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల

ఆదివారం 19 మార్చి 2023 8 పేజీలు




## నడిరోడ్డుపై పడిన గ్రానైట్ రాయి

# తప్పిన పెను ప్రమాదం



సూర్య గంగాధర

(వివరాలు 2లో)

# ఆత్మగౌరవ లోగిళ్లు.. మన డబుల్ బెడ్ రూం ఇండ్లు

## రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

- అభివృద్ధి-ప్రజా సంక్షేమం ప్రభుత్వానికి రెండు కండ్లు
- పేదల ఆత్మగౌరవంతో జీవించాలనేదే ప్రభుత్వ లక్ష్యం

**సూర్య పెగడపల్లి**



పేదలు ఆత్మ గౌరవంతో డబుల్ బెడ్ ఇండ్లలో జీవించాలన్నది సీఎం కేసిఆర్ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. పెగడపల్లి మండలం నందగిరి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 35 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును, 43.23 లక్షలతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన, 75.6 లక్షల వ్యయంతో నిర్మించిన 15 డబుల్ బెడ్ రూం



ఇండ్లను శనివారం ప్రారంభించి లబ్దిదారులకు అందజేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గూడు లేని నిరుపేదలకు సకల సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో ఆత్మ గౌరవంతో జీవించాలన్నది రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు స్వప్నమని తెలిపారు. ప్రజలలో అధిక డిమాండ్ ఉన్న నేపథ్యంలో సీఎం కేసిఆర్ త్వరలో నూతన పథకం ప్రారంభిస్తారని, స్థలం ఉన్న వారికి ఇండ్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల వరకు త్వరలో ఆర్థిక సహాయం అందజేస్తారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పేద ప్రజలకు సీఎం కేసిఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. 40 లక్షల మందికి ఆసరా పెన్షన్లు అందిస్తున్నామని త్వరలో అర్హులైన మిగిలిన వారికి సైతం పెన్షన్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలో అభివృద్ధి కోసం పటిష్ట చర్యలు (మిగతా 2లో)

# పార్లమెంటు వేదికగా పచ్చి అబద్ధాలు మాట్లాడిన కేంద్ర మంత్రి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్



**సూర్య, ఇల్లంతకుంట**

పార్లమెంటు వేదికగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం జలాశయానికి జాతీయ హోదా కల్పించాలని, అసలు కోరనేలేదని కేంద్ర జల శక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు దేశ అత్యున్నత చట్టసభ పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెప్పారని, తన తప్పుడు ప్రకటనను ఉపసంహరించుకొని క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి బిశ్వేశ్వర్ తుడు తన తప్పుడు ప్రకటనలు సవరించుకొని వాస్తవాలతో కూడిన తాజా ప్రకటనను పార్లమెంట్‌లో ప్రకటించాలని, లేని పక్షంలో కేంద్ర మంత్రిపై పార్లమెంట్‌లో ప్రివిలేజ్ మోషన్ ఇస్తామని వినోద్ కుమార్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాల్సిందేనన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గోదావరి నదిపై కాళేశ్వరం ప్రాజెక్టు, కృష్ణా నదిపై పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును నిర్మిస్తున్నందున ఈ రెండు ప్రాజెక్టులలో ఏదో ఒక దానికి జాతీయ హోదా ఇవ్వాలని 2018 జూలై 20 నాడు తాను కరీంనగర్ ఎంపీగా పార్లమెంట్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సహా కేంద్ర ప్రభుత్వానికి కోరినట్లు తెలిపారు. తన మాటలు పార్లమెంటు రికార్డ్స్‌లో ఉన్నాయని వాటిని తెప్పించుకొని కేంద్ర సహాయ మంత్రి వింటే వాస్తవాలు నిగ్గు తేలుతాయని వినోద్ కుమార్ స్పష్టం చేశారు. అప్పటి కేంద్ర జల శక్తి శాఖ మంత్రి నితిన్ గట్కరి సమాధానమిస్తూ దేశంలో (మిగతా 2లో)

## అంగారికా టౌన్ షిప్ లోని 49 ప్లాట్లకు

# వేలం రూ.12.26 కోట్ల ఆదాయం

- జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామం అంగారికా టౌన్ షిప్ లోని ప్లాట్ లను ప్రత్యక్ష వేలం ద్వారా 49 ప్లాట్ లను శనివారం అమ్మడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. కరీంనగర్ పట్టణంలోని వాసర గార్డెన్ లో శుక్రవారం రోజున అంగారక టౌన్షిప్ లోని 157 ప్లాట్లలలో శనివారం 50 ప్లాట్లకు ప్రత్యక్ష వేలం వేసి 49 ప్లాట్స్ అమ్మడం జరిగిందని, వేలంలో 12.26 కోట్ల రూపాయల ఆదాయం వచ్చినదని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం రోజున ప్రత్యక్ష వేలం పాటలో అత్యధికంగా చదరపు గజానికి రూ. 17400/- మరియు అతి తక్కువ చదరపు గజానికి ధర రూ.6000/- అమ్మడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. మిగతా ప్లాట్లకు మార్చి 19 తేదీన (మిగతా 2లో)





# జగిత్యాల ఖిల్లాను గొప్ప పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతాం

- కలెక్టర్ యాస్మిన్ భాషా

**సూర్య జగిత్యాల**

జగిత్యాల ఖిల్లా'ను గొప్ప పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతాం అని ఖిల్లా ను జిల్లాకు ఎస్సెట్ లాగా అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తాం, త్వరలోనే ప్రభుత్వ శాఖల సమన్వయంతో సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వ అనుమతికి పంపుతాం అని జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాష అన్నారు. శతాబ్దాల క్రితం నిర్మించిన, చారిత్రక ప్రాశస్త్యం గల 'జగిత్యాల ఖిల్లా'ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు.జిల్లా కు అసెట్ గా జగిత్యాల ఖిల్లా ను అభివృద్ధి చేసే ఉద్దేశ్యంతో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ మందా మకరంద్ తో కలిసి శనివారం ఖిల్లా (మిగతా 2లో)

# నవీన్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- మంత్రి కేటీఆర్

**సూర్య రాజన్న సిరిసిల్ల**



చేయడానికి సరైన ఉద్యోగం లేక జీవితంపై విరక్తితో నిన్న ఆత్మహత్య చేసుకున్న నవీన్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని స్థానిక ఎమ్మెల్యే మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. శనివార ఆత్మహత్య చేసుకున్న నవీన్ తండ్రి నాగభూషణంతో ఫోన్లో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. అర్ధాంతరంగా నవీన్ తనువు చాలించడం బాధాకరం అన్నారు. ఎదిగిన కొడుకు అర్ధాంతరంగా బలవన్మరణానికి పాటుపడడం పట్ల తన ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటాం అధైర్యపడొద్దని నవీన్ తండ్రి నాగభూషణంకు కేటీఆర్ భరోసానిచ్చారు. నవీన్ అంత్యక్రియలకు దగ్గరుండి ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ పాలకవర్గానికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు.



# పెగడపల్లి మండలం మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

**సూర్య పెగడపల్లి**

కాంగ్రెస్, బీజేపీ పాలనలో రైతులకు అన్యాయం పెగడపెల్లి వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ , డిసిఎంఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ , వోరుగంటి రమణా రావు పెగడపెల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా ప్రమాణం చేసిన లోక నిర్మల మల్లారెడ్డి , వైస్ చైర్మన్ రాజు ఆంజనేయులు కొప్పుల అభినందనలు తెలిపారు, ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... మొదటగా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన చైర్ పర్సన్, పాలక వర్గం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీలు రైతులకు సేవ చేస్తూ అండగా ఉండాలి, సహాయ పడాలి. లాభసాటి పంటలను పండించే విదంగా





ధాన్యం కొనుగోలు కు నిర్ణయం తీసుకున్నారన్నారు. కేంద్రం సహకరించకున్న, వడ్లను కొనుగోలు చేసేది లేదని చెప్పినప్పటికీ కేవలం రైతులను ఆదుకోవాలన్న సంకల్పంతోనే రైతు పక్షపాతిగా సీఎం మరోసారి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోలు ద్వారా సుమారుగా 1200 కోట్ల రూపాయలు నష్టం వస్తుందనీ తెలిసిన రైతుల కోసం పరితపించే మన కెసిఆర్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.
ఈ విషయంలోనే అర్థం అవుతుంది కెసిఆర్ రైతుల పక్షపాతి అని. మన తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఎన్నో రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఒక రకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్ రావు, యం పి పి గోలి శోభ సురేందర్ రెడ్డి, వైస్ ఎంపిపి గాజుల గంగదర్, ఆర్ బి యస్ మండల అద్యక్షులు నరేందర్ రెడ్డి, పిఏసియస్ చైర్మన్ లు మంత్రి వేణు, కర్ర బాస్కర్ రెడ్డి, సర్పంచ్ ల ఫోరం అద్యక్షులు కోరుకంటి రాజేశ్వరరావు, మండల అద్యక్షులు లోక మల్లారెడ్డి, ప్రదాన కార్యదర్శి బండి వెంకన్న, తాహసిల్దార్ కృష్ణ చైతన్య, యంపివో మహేందర్, మాజి ఏయంసి చైర్మన్ తిరుపతి నాయక్, డైరెక్టర్ లు ఏడుమ్యాకల పద్మ, ఇటిక్యాల కిరణ్ కుమార్, పలుమారు విజయ్, ఆజ్మీర భూమానాయక్, తడగొండ సాగర్, చెట్ల శ్రీనివాస్, పల్నాటి లావణ్య, మడిగెల తిరుపతి, ఈరు కనుక య్య, ముదుగంటి గోపాల్ రెడ్డి, నురుగొండ మోహన్, వెల్మ సత్యనారాయణ రెడ్డి, ఎక్సఆపిషియో సభ్యులు మంత్రి వేణు, మేర్గు శ్రీనివాస్. రైతులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## తక్కళ్ళపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ హుండీ లెక్కింపు

**సూర్య-కథలాపూర్**



శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల జాతర సందర్భంగా వచ్చిన హుండీ ఆదాయం లెక్కింపు కమిటీ అధ్యక్షుడు జిల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. శనివారం దేవాలయ ఆవరణలో కమిటీ సభ్యులు లెక్కింపు చేయగా భక్తుల ద్వారా వచ్చిన హుండీ ఆదాయం రూ:50,760 రాగా కొంత బంగారం,వెండి నాణాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ కమిటీ ఉపాధ్యక్షుడు తోట గంగారెడ్డి పటేల్,ప్రధాన కార్యదర్శి పంజాల వెంకట రాములు, కోశాధికారి ఎస్కి రాజేందర్, సహాయ కార్యదర్శి క్యాతం చిన్న రెడ్డి,సభ్యులు పొన్నం నరేందర్,మోతుకూరి వెంకటేష్,ఎస్కి రాజేందర్,మేడిపల్లి రాజరెడ్డి తదితరులు ఉన్నారు.

## తైబజార్ వేలం వాయిదా

**సూర్య మెట్‌పల్లి**

పట్టణ మున్సిపల్ పరిధిలో 2023, 2014 ఆర్థిక సంవత్సరం కు రోజువారీ మార్కెట్ ఫీజుల వసూలు తైబజార్ వేలం ను రద్దు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. తైబజార్ వేలం శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తూ ఉండగా. వేలంలో పాల్గొన్న ఐదుగురు సభ్యులు సర్కారు వారి పాత నచ్చకపోవడం తో సభ్యుల కోరిక మేరకు వేలం పాటను తాత్కాలికంగా వాయిదా వేసి ఈ నెల 21వ తేదీ మంగళవారం నిర్వహించనున్నట్లు ఈ వేలం పాటలో పాల్గొనే సభ్యులు 21వ తేదీ మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయంలో జరిగే వేలం పాటలో పాల్గొనాలని కమిషనర్ సూచించారు.

## ఎస్సై శ్వేతను సన్మానించిన బీఎస్పీ నాయకులు

**సూర్య-కథలాపూర్**



పదవి బాధ్యతలు చేపట్టిన నూతన ఎస్సై శ్వేత ను మండల బీఎస్పీ నాయకులు శాలువా తో సన్మానించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆమెను మార్యద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బి ఎస్ పి మండల అధ్యక్షుడు తెడ్డు గంగాధర్,నియోజకవర్గ కో-కన్వీనర్ బాలే నీలకంఠం, బి ఆర్ ఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్ పాలేపు సంజీవ్,బాలే మహేష్ తదితరులు ఉన్నారు

## లోక్ అదాలత్ లో 8 కేసుల పరిష్కారం

**సూర్య మెట్‌పల్లి**



మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ బ్యాంక్ లోక్ అదాలత్ లో 8 కేసులు పరిష్కారం అయ్యాయి. మెట్‌పల్లి కేంద్రం ఇంచార్జ్ చైర్మన్ జె. వినీల్ కుమార్ జగిత్యాల కోర్టులో నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ లో యూనియన్ బ్యాంక్ కి చెందిన 8 కేసులను రాజీ చేయడమే కాకుండా కస్టమర్ల వద్ద నుండి ఒక లక్ష డెబ్బై ఏడు వేల రూపాయలను బ్యాంక్ లో డిపాజిట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక వ్యవహారాలలో రాజీని మించిన పరిష్కార మార్గం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది మరియు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మోహన్ కుటుంబాన్ని పరామర్శించిన జువ్వాడి

**సూర్య -కోరుట్ల రూరల్**



కోరుట్ల మండలం చిన్న మెట్ పల్లి గ్రామానికి చెందిన పూదరి మోహన్ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. కృష్ణారావు వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయినపల్లి సత్యం రావు,గ్రామ కమిటీ కాంగ్రెస్ అద్యక్షులు ఆర్మూర్ గంగాధర్,మాజీ సర్పంచ్ బోల్లే నర్సయ్య, మోత్కూరి సత్యం గౌడ్, బోల్లే ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## కుల సంఘ అభివృద్ధికి కృషి చేస్తా చంద్రయ్య

**సూర్య మెట్‌పల్లి**



కుల సంఘం అభివృద్ధి కోసం అందరినీ కలుపుకొని తన వంతు కృషి చేస్తానని విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం నూతన అద్యక్షుడు పులిమామిడి చంద్రయ్య అన్నారు. నూతనంగా ఎన్నికైన సంఘ కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ప్రమాణ స్వీకార అనంతరం చంద్రయ్య మాట్లాడుతూ. తన పై నమ్మకంతో గెలిపించిన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కుల సంఘం సభ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు శ్రీధర్, లక్ష్మణ్, రవి, గోవర్ధన్ వెంకన్న, చిన్నయ్య, దేవయ్య, గంగాధర్, నవీన్, నాగభూషణం హనుమాన్లు, రాజశేఖర్ ,రాజేందర్, దామోదర్, లక్ష్మీరాజం,రాజు,మారుతి ,గంగాదర్శనం, రాజు, శ్రీనివాస్, రాజు,నరసయ్య,రాముల,శంకర్, గంగారాం లు బాధ్యతలు చేపట్టారు. అనంతరం సంఘ అధ్యక్ష, కార్యవర్గాన్ని సంఘ సభ్యులు సన్మానం చేశారు.

## రామాలయంలో శ్రీ రామనవమి వేడుకలు ఘనంగా జరగాలి

**ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్**



**సూర్య జగిత్యాల**

జగిత్యాల ధరూర్ క్యాంప్ శ్రీ కోదండ రామాలయం లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరగాలని ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. ఆలయ 44వ బ్రహ్మోత్సవాల కరపత్రం శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూరామాలయం లో చాలా గొప్పగా శ్రీరామ నవమి వేడుకలు జరుగుతాయి అని అన్నారు. పట్టణంలో అన్ని రామాలయలకు పురపాలక సంఘం నిదులు కేటాయించడం జరిగింది అన్నారు. అన్ని మతాల వారిని ప్రతి ఒక్కరూ పరస్పరం గౌరవించుకోవాలని కోరారు. శ్రీ రామ నవమి వేడుకలను ప్రజలందరూ విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఆలయాల అభివృద్ది జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్,స్థానిక కౌన్సిలర్ శ్రీలత,రామాలయ ఛైర్మెన్ బ్రహ్మండ భేరి నరేష్,ఆలయకార్యవర్గం,కే డి సి సి జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రాంచందర్ రావు,కౌన్సిలర్ అవారీ శివ కేసరి బాబు,పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు,నాయకులు సమిండ్ల శ్రీనివాస్,కొల శ్రీనివాస్, రంగు రాజయ్య, రాము, తిరుమయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## అమ్మవారి సన్నిధిలో మర్రి చెట్లు నాటిన యూత్ సభ్యులు

**సూర్య- కోరుట్ల రూరల్**



మండలంలోని పైడిమడుగు గ్రామంలోశుక్రవారం అమ్మవారు సన్నిధిలో శనివారం అదే గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో మర్రి మొక్కలను నాటారు. అయిదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మర్రి చెట్టు వద్ద మొక్కలను నాటితే మర్రి చెట్టు దట్టంగా అవుతుందని,ఆసియా ఖండంలోనే రెండవ అతి ఎక్కువ విస్తరణ లో ఉన్న మర్రిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి బాధ్యతగా మొక్కలు నాటామని యూత్ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ దమ్మ భీమారెడ్డి,ఫ్రెండ్స్ స్టార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాలలో వాక్-ఇన్- ఇంటర్వ్యూ

**సూర్య- కోరుట్ల**



పట్టణము లోని శ్రీఅరుణోదయ డిగ్రీ కళాశాలలో ఈనెల 20 సోమవారం ఉదయం 10:30 గంటల నుండి వాక్ -ఇన్- ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ తెలిపారు. టైమ్స్ ప్రో వారి సహకారంతో శాశ్వత ప్రాతిపదికన ఐసీఐసీఐ బ్యాంకు వారుశ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఇంటర్వ్యూలో ఇప్పటివరకు 88 మంది ఎంపిక కాగా, వారందరికీ ఆఫర్ లెటర్ అందినట్లు ఆయన తెలిపారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి అరుణోదయ డిగ్రీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు జరుగుతాయన్నారు. శాశ్వత ప్రాతిపాదికన ఐసీఐసీఐ బ్యాంకులలో నెలకు 20,000 పైన జీతభత్యాలు అందుకొనే సువర్ణ అవకాశం. ఏదైనా డిగ్రీ/ బిటెక్ లో 50% మార్కులు కలిగివుండి 1997-2003 మధ్య జన్మించి, 26 సంవత్సరాలు లోపు వయసు ఉన్నవారు అర్హులు. మరిన్ని వివరాల కోసం 8106764653, 7893922966, లను సంప్రదించాలన్నారు .నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సువర్ణ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్, ప్రిన్సిపాల్ పోతని నవీన్'లు తెలిపారు. ఇంటర్వ్యూ హాజరు అవుతున్న వారు మీ యొక్క విద్య అర్హతలు తెలియజేసేలా బయోడెటా తయారుచేసుకొని రాగలరని వారు పేర్కొన్నారు.

### టిఎస్ పీఎస్ సి పరీక్ష ప్రశ్న పత్రాల లీకేజీపై

## సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలి

**సూర్య -కోరుట్ల5**



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై తక్షణమే సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . కోరుట్లలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ 30 లక్షల మంది విద్యావంతులైన నిరుద్యోగ యువత జీవితాలకు సంబంధించిన టీఎస్ పిఎస్సీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే స్పందించాలనీ , తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ వ్యవహారంలో టీఎస్ పీఎస్సీ చైర్మన్ తో పాటు సభ్యులను వెంటనే తొలగించాలని , లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు . మరో తొమ్మిది నెలల్లో ఎన్నికలు సమీపిస్తుండడంతో వాటిని దృష్టిలో ఉంచుకొని ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు . ఉద్యోగాల కోసం 30 లక్షల మంది నిరుద్యోగ యువత నిద్రాహారాలు మాని కోచింగ్ లు తీసుకున్నారనీ పేర్కొన్నారు . కానీ రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత , నిర్లక్ష్యం కారణంగా పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీలు , బాధ్యులపై చర్యలు తీసుకోకుండా కంటితుడుపు వ్యవహారాలు చేపట్టడం దారుణమన్నారు . రాజ్యాంగంలోని ఆర్టికల్ 317 ను ఉపయోగించి రాష్ట్ర గవర్నర్ తక్షణమే టిఎస్ పిఎస్సి చైర్మన్ తో పాటు సభ్యులను భర్తరఫ్ చేయాలని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి డిమాండ్ చేశారు .

# పల్లె ప్రగతి తో పల్లెల రూపురేఖలు మారాయి

## -జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ

**సూర్య. కోనరావుపేట**



పల్లె ప్రగతి తో పల్లెల రూపురేఖలు మారాయని జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. శనివారం కోనరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ భారత్ మిషన్ (గ్రామీణ) ఫేస్ - (3 రోజుల) శిక్షణ ముగింపు కార్యక్రమంలో భాగంగా ఎంపిపి చంద్రయ్య గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్పీ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పల్లెల అభివృద్ధే లక్ష్యంగా పల్లె ప్రగతి, హరితహారం, కార్యక్రమాలను ప్రారంభించి పల్లెల రూపురేఖలు మార్చారని అన్నారు.

ప్రతి గ్రామంలో వైకుంఠధామలు,డంపింగ్ యార్డ్, గ్రామీణ క్రీడ ప్రాంగణాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయితీలు గా ఎక్కువ గ్రామాలు మన రాష్ట్రం నుంచే అవార్డులను అందుకున్నాయని అన్నారు.

గ్రామాల్లోప్రజా ప్రతినిదులు, అధికారుల సమిష్టి కృషితో మన రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ కు ఉత్తమ జిల్లా ప్రజా పరిషత్ అవార్డు రావడం జరిగిందన్నారు. స్వచ్ భారత్ మిషన్ (గ్రామీణ) ఫేజ్- II కార్యక్రమంలో ముఖ్యంగా ODF సుస్థిరత సాధించేందుకు ప్రతి సింగిల్ పిట్ మరుగుదొడ్డినీ రెండు గుంతల మరుగుదొడ్డి గా మార్చులన్నారు. ప్రతి సెప్టిక్ టాంక్ ను ఇంకుడు గుంతకు అనుసంధానం చేయలన్నారు. అన్ని గ్రామాల్లో తడి,పొడి చెత్త ఇంటి వద్దనే వేరు చేసే విధంగా గ్రామస్తులకు, ప్రజలకు మరింత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి రోజు రోడ్లు, వీధులు క్రమం తప్పకుండా శుభ్రపరచాలన్నారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అధికారులు స్వచ్ఛ భారత్ గురించి అవగాహన కల్పించాలని అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పోకల రేఖ సంతోష్, అరే లత మహేందర్, ఎంపీపీటీసీలు నర్సింహాచారి, ప్రవీణ్ కుమార్, ఎంపిడిఓ రామకృష్ణ, స్వచ్‌భారత్ మిషన్ కో ఆర్డినేటర్ సురేష్, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వివోలు పాల్గొన్నారు.




## ఇల్లంతకుంట లో బోయినపల్లి వినోద్ కు ఎంపిపి స్వాగతం

**సూర్య. ఇల్లంతకుంట**



మండల కేంద్రమైన ఇల్లంతకుంట కు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ శనివారం రాగా ఎంపిపి వుట్కూరి వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి సంజీవ్, వైస్ ఎంపిపి సుదగోని శ్రీనాథ్ గౌడ్, పాక్స్ వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి లు కలిసి శాలువా కప్పి స్వాగతం పలికారు. వీరిలో సర్పంచ్ లు అమర్ , తిరుపతి రెడ్డి , ఎలుక స్వామి తదితరులున్నారు.

## కల్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**సూర్య తంగళ్లపల్లి**



చిన్న లింగాపూర్ గ్రామంలో సర్పంచ్ వాసిరెడ్డి అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పిటిసి పూర్మాని మంజుల రామలింగారెడ్డి హాజరై ప్రజా ప్రతినిధులతో కలిసి,కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ముగ్గురు, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇద్దరు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి కేసీఆర్ కు, మంత్రి కేటీఆర్ లకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ బైర్నేని రాము, మండల బీఆరెస్ పార్టీ అధ్యక్షులు గజబింకార్ రాజన్న ,ఏఎంసీ డైరెక్టర్ రాజేశ్వరరావు, మండల రైతు సెల్ అధ్యక్షులు మోహన్ రెడ్డి ,మాజీ ఎంపీటీసీ శ్యాగ దేవేందర్ ఉపసర్పంచ్ వర్కల ఎల్లవ్వ, బీఆరెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అనిల్ కుమార్ ,జిల్లా యూత్ నాయకులు ఎల్లం యాదవ్ మండల ప్రచార కార్యదర్శి చీకోటి మల్లేశం,సీనియర్ నాయకులు కొండేటి రామచంద్రారెడ్డి,వర్కల మల్లేశం వార్డు మెంబర్లు ,గుర్రం రవీందర్ రెడ్డి,శ్యాగ యాదగిరి,పిట్ల రవి,మహిమల భవాని,జక్కుల లావణ్య ,వంతడ్పుల మంజుల,యూత్ అధ్యక్షుడు బిక్షపతి ,బాబు ,అనిల్ ,రవి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత పాలన వల్ల నిరుద్యోగల ఆత్మహత్యలు

### -కెకె మహేందర్ రెడ్డి

**సూర్య సిరిసిల్ల టౌన్**



రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణం లోని బివై నగర్ కు చెందిన చిటికెన నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శించిన కెకె మహేందర్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగం అనేది లేకుండా చేస్తామని తప్పుడు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి డబ్బులు ఖర్చు పెట్టుకుని కుటుంబానికి అండగా ఉండాలని, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తున్న యువతను ఈ ప్రభుత్వం చేస్తున్న దగా కోరుతనానికి,దోపిడీ పాలనకు బలి కావలసిన పరిస్థితి ఏర్పాటయింది. ఈ ప్రాంతం నుండి ప్రాతినిధ్య వహిస్తున్న కేటీఆర్ ఈ జిల్లాలో జరిగిన ఆత్మహత్యలపై కనీసం పరామర్శకు రాకుండా సోషల్ మీడియా వేదికగా మాట్లాడడం హేయమైన చర్య అని అన్నారు.నేతి బీరకాయ లోని నెయ్యి ఎంత నిజమో కేసీఆర్,కేటీఆర్ మాటలు వారి పాలన అంతే నిజం,కేటీఆర్ కు దోపిడీ పై ఉన్న ప్రేమ"లీక్ లపై ఉన్న శ్రద్ధ,నిరుద్యోగుల పై లేక పోవడం,లిక్కర్ స్కాం కోసం పెట్టె శ్రద్ధ నిరుద్యోగుల కోసం కొంతైనా ఉంటే బాగుండునని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుద్యోగ యువతకు భరోసా కల్పించే విధంగా ఉద్యోగ ప్రకటనలు ఇచ్చి వారిని ఆదుకోవాలి,అలాగే ఏదైతే మీరు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ భృతిని అర్హులైన వారందరికీ చెల్లించాలని డిమాండ్ చేశారు.ముమ్మాటికి నిరుద్యోగ ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే ఈ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనం గా కనబడుతున్నాయి.ఆరు మాసాల క్రితం తంగళ్ళపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి ఆరేపల్లి విష్ణు కుటుంబాన్ని,నిన్నటి రోజున సిరిసిల్ల పట్టణానికి చెందిన చిటికెన నవీన్ కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ నాయకులు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆకునూరి బాలరాజు,సీనియర్ నాయకులు కౌన్సిలర్ చొప్పదండి ప్రకాష్,మైనార్టీ నాయకులు ఎండి కాజా,యూత్ నాయకులు గంభీరావుపేట ప్రశాంత్, తంగళ్ళపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్ టోనీ,జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి మునిగల రాజు, జిల్లా పార్టీ హ్యూమన్ రైట్స్ కన్వీనర్ గుగ్గిళ్ళ భరత్ గౌడ్ ఉన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

### -జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

**సూర్య.ఇల్లంతకుంట**



మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. శనివారం మండలంలోని అనంతారం గ్రామంలోని 28 మహిళా సంఘాలకు రూ. 2లక్షల 45677 వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం మంజూరు చేయగా ప్రొసీడింగ్ పత్రాలను మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మహిళల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం మహిళలు అన్నీ రంగాల్లో రాణించాలనే లక్ష్యంతో బ్యాంకు ల ద్వారా కోట్లాది రూపాయల రుణాలు అందించడం జరుగుతుందన్నారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దదానికీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదేశాలతో మండలంలోని అన్నీ గ్రామాల్లో మహిళా సంఘ భవనాలను నిర్మాణం చేయడం జరుగుతుందని, మహిళలకు ప్రభుత్వ పథకాలను సక్రమంగా అందేలా చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ మామిడి సంజీవ్, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్ రెడ్డి, సర్పంచ్ చల్ల నారాయణ, ఎంపీటీసీ లు తీగల పుష్పలత,ఓగ్గు నర్సయ్య యాదవ్, ఏఎంసి వైస్ చైర్మన్ చందన్, వీఓఏ రాజశ్రీ, వీఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

**సూర్య వేములవాడ**



వేములవాడ రూరల్ మండలం ఫాజుల్ నగర్ లో ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు వద్ద శనివారం రూరల్ ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. రోడ్ డ్యామ్ ఏరియా లో మూల మలుపు ఉండటం వల్ల గతంలో పలు ప్రమాదాలు జరగటంతో,వాటి నివారణకోసం శనివారం రూరల్ పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## ఇంటింటికీ చల్మెడ వైద్య సేవలు

**సూర్య కోనరావుపేట**



గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా చల్మెడ హాస్పిటల్ ఆధ్వర్యంలో కోనరావుపేటలో ఇంటింటికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చల్మెడ హాస్పిటల్ అధినేత చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. శనివారం కోనరావుపేట మండల కేంద్రంలో చల్మెడ హాస్పిటల్ వైద్య బృందంతో ఇంటింటికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితి డాటాను తయారు చేసి ఉచిత వైద్యం అందిస్తామన్నారు. హాస్పిటల్ లో అన్ని రకాల వైద్యం తో పాటు అన్ని విభాగాలకు చెందిన డాక్టర్లు అందుబాటులో ఉన్నారన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు కొంతమంది డబ్బుల్లేక అన్ని రకాల వైద్య పరీక్షలు చేసుకోలేకపోతున్నారని, అలాంటి వారికి ఈ చల్మెడ హెల్త్ క్యాంప్ ఉపయోగపడుతుందని సర్పంచ్ పోకల రేఖ అన్నారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింహాచారి,ముష్నం జీవన్ గౌడ్, నాయకులు పోకల నారాయణ,పోకల సంతోష్,మాజీ ఎంపిటిసి బొడ్డు చంద్రయ్య,ఆరె మహేందర్ పాల్గొన్నారు.

## రాజన్న సేవలో ప్రముఖులు

**సూర్య వేములవాడ**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఇరువురు వేర్వేరు సమయాల్లోప్రముఖులు దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐఏఎస్ పి.కాత్యాయని దేవి మరో కార్యక్రమంలో కొండలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఆర్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీమతి డా.నీరజ ప్రభాకర్ లు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి ప్రసాదం అందజేశారు.

## రుద్రంగిలో వడగండ్ల వాన

**సూర్య రుద్రంగి**



మండల కేంద్రంలో శనివారం సాయంత్రం వడగండ్ల వాన కురిసింది. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. ఈ క్రమంలోనే భారీగా వడగండ్లు కూడా కురిసాయి. కురిసిన వడగండ్లతో ఇండ్ల నుండి బయటకు రావాలంటే జనాలు భయపడ్డారు. రోడ్డుపై మంచు ముక్కలు ఆరబోసినట్లు వడగండ్లు చూపరులకు కనువిందు చేశాయి. భారీ వడగండ్లతో రుద్రంగిలో పొట్టదశలోని వరి, మామిడి, మిర్చి, చిరు ధాన్యాలు,కూరగాయల తోటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## అంగన్వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం

**సూర్య చందుర్తి**



అనారోగ్యంతో ఉన్న శిశువుల కోసం అంగన్వాడి టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిడిపిఓ ఎల్లయ్య అన్నారు మండలంలోని అంగన్వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అనారోగ్యంతో ఉన్న శిశువులకు ఎలాంటి ఆహారం ఇవ్వాలి అతి తీవ్ర లోప పోషణను గుర్తించడం నివారించడం అనారోగ్యంతో ఉన్న శిశువును ఎల్లప్పుడూ పర్యవేక్షిస్తూ కోలుకునే దాకా అంగన్వాడి టీచర్లకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించడం జరిగింది అతి తీవ్ర లోపంతో బాధపడుతున్న పిల్లలకు బరువు మరియు ఎత్తు వారి యొక్క పోషణ స్థాయిని గుర్తించి ఎలా నివారించాలి అనే విషయాలపై అంగన్వాడి ఉపాధ్యాయులకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి సిడిపిఓ ఎల్లయ్య సూపర్వైజర్ శంకరమ్మ పోషణ అభియాన్ కోఆర్డినేటర్ రాజ్ కుమార్ అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు

## మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

**సూర్య రుద్రంగి**

రుద్రంగి మండల కేంద్రంలో ని మండల పరిషత్ కార్యాలయంలో 2022-23 సంవత్సరానికి గాను మండలానికి మంజూ రైన మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూ ను శనివారం ఎంపీడీఓ శంకర్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం మండలానికి లక్ష లోపు 2 యూనిట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. మైనార్టీ కార్పొరే షన్ రుణాల కోసం 26 మంది దరఖాస్తులు చేసుకోగా వారికి ఇంటర్వ్యూ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సుధాకర్, ఐకేపీ ఏపీఎం రాజు, యూనియన్, కేడీసీసీ బ్యాంక్ అధికారులు, దరఖాస్తు దారులు పాల్గొన్నారు.

